ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
బుధవారం, 21 ఆగస్టు 2024

మరణంలోనూ తోడుగానే..

- రోడ్డు ప్రమాదంలో కవల సోదరుల దుర్మరణం
- మరో వ్యక్తికి తీవ్రగాయాలు
- మద్దులపల్లి వద్ద బైక్‌ను ఢీకొట్టిన ట్రాలీ ఆటో



మహేష్



నవీన్

ఖమ్మం రూరల్, ఆగస్టు 20: వారిద్దరూ కలిసే పుట్టారు.. 22 ఏళ్ల కలిసి మెలిసి ఒకరికోసం ఒకరు అన్నట్లుగా పెరిగి పెద్దయ్యారు. చివరికి అనుకోని ప్రమాదంలో ఇద్దరూ ఒకేసారి ప్రాణాలు విడిచారు. ఖమ్మంరూరల్ మండలం మద్దులపల్లి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కవల సోదరులు మృతి చెందారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని దానవాయిగూడెం కాలనీకి చెందిన అత్తులూరి నరసింహరావు, రమా దంపతులకు మహేష్ (22), నవీన్ (22) అనే కవల పిల్లలున్నారు. వీరిద్దరు డిగ్రీ వరకు చదువుకుని పోలీస్ ఉద్యోగం కోసం ఖమ్మంలో కోచింగ్ తీసుకుంటున్నారు.

అయితే మంగళవారం సాయంత్రం కూసుమంచిలోని వారి మామయ్య మెకానిక్ షాపు వద్దకు బైక్‌పై బయలుదేరారు. మహేష్, నవీన్‌లతోపాటు వారి స్నేహితుడు భద్రాద్రి జిల్లా సుజాతనగర్‌కు చెందిన పవన్ ముగ్గురు కలిసి బైక్‌పై ఖమ్మం నుంచి కూసుమంచి వెళ్తుండగా మద్దులపల్లి గ్రామం వద్ద సూర్యాపేట వైపు నుంచి ఖమ్మం వస్తున్న ట్రాలీ ఆటో వారు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేష్, నవీన్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి పవన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ పవన్‌ను స్థానికులు ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాద విషయం తెలుసుకొని ఆసుపత్రి వద్దకు చేరుకున్న తల్లిదండ్రులు తమ కుమారుల మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. జీవితాంతం ఆసరాగా ఉంటారనుకున్న ఇద్దరు కుమారులు ఒకేసారి మృతి చెందడాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒక్కటవ్వక ముందే ఒక్కటిగా వెళ్లిపోయారు..

- అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా
- కాబోయే వధూవరుల దుర్మరణం
- భద్రాద్రి జిల్లా కమలాపురంలో విషాదం



ప్రసాద్(ఫైల్)



నాగమణి(ఫైల్)



నాగమణి, ప్రసాద్ మృతదేహాలు

ములకలపల్లి, ఆగస్టు 20: ట్రాక్టర్ బోల్తాపడి కాబోయే వధూవరులు మృతి చెందిన సంఘటన సోమవారం అర్ధరాత్రి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం కొత్తూరు గ్రామశివారులో జరిగింది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం తుమ్మల చెరువుకు చెందిన తాటి ప్రసాద్(23)కు ములకలపల్లి మండలం కమలాపురం గ్రామానికి చెందిన ప్రతి నాగమణి(20)తో వివాహం నిశ్చయమైంది. వీరి వివాహం త్వరలో జరగాల్సి ఉంది. ప్రసాద్ తన సొంత ట్రాక్టర్‌తో రెండు రోజుల క్రితం కమలాపురం గ్రామంలోని తన కాబోయే అత్తవారింటికి వెళ్లాడు. అక్కడ అత్తవారి ఇంటి వ్యవసాయ పనులు ముగించుకుని తిరిగి తన స్వస్థలమైన అశ్వాపురానికి ట్రాక్టర్‌పైనే కాబోయే భార్య నాగమణిని తీసుకుని బయలుదేరాడు. ఈ క్రమంలో ములకలపల్లి మండలం కొత్తూరు గ్రామశివారులో రోడ్డు వంపు ఉన్న ప్రాంతంలో రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించబోయి ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టి తలకిందులుగా పడిపోయింది. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న ప్రసాద్, నాగమణి ట్రాక్టర్ కింద పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ప్రసాద్ తండ్రి తాటి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు ములకలపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు మంగళవారం పాల్వంచ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. త్వరలో వివాహం జరగాల్సిన జంట మృతి చెందడంతో వారి గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.



వీసీలో సమీక్షిస్తున్న మంత్రి పొంగులేటి

వేగవంతంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన

- తాత్కాలికంగా సిబ్బందిని నియమించుకోండి
- ప్రభుత్వ భూముల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోండి
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


ఖమ్మం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని, అవసరమైతే తాత్కాలిక సిబ్బందిని నియమించుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. పరిశీలనకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ మూడునెలల్లో పూర్తిచేయాలని సూచించారు. ప్రభుత్వ భూములకు ఎక్కడా నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంగళవారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్సు నిర్వహించారు. హైదరాబాద్ సచివాలయం నుంచి సీఎస్ శాంతికుమారితోపాటు ఇతర అధికారులతో కలిసి ఎల్ఆర్ఎస్, కొత్త ఆర్వోఆర్ చట్టంపై, భారీవర్షాలపై ఆయా జిల్లా కలెక్టర్లతో వీసీ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి 20లక్షల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి స్క్రూటినీ, నిర్దేశిత మార్గదర్శకాల సూత్రాల ప్రకారం పూర్తిచేయాలన్నారు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పూర్తిచేయాలని, అవసరమైతే జిల్లాలో అదనపు సిబ్బందిని తాత్కాలిక ప్రాతిపదికన నియమించుకోవాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో అవసరమైన సమాచారాన్ని పూర్తిగా పరిశీలించాలని జిల్లాలో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రకారం బృందాలను ఏర్పాటుచేసి వాటి వివరాలు సేకరించాలని, యాప్‌లో నమోదు చేసేలా చూడాలని మంత్రి కోరారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు సర్వేనెంబరు వారీగా సంబంధిత రెవెన్యూ గ్రామం, మునిసిపాలిటీల్లో బృం దాలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి జీపీఎస్ ద్వారా సదరు భూమి వివరాలు పక్కాగా నమోదుచేయాలని అదే సమయంలో సంబంధిత భూములు బఫర్‌జోన్, నాలా, చెరువులు, హెరిటేజ్ బిల్డింగ్, డిఫెన్సుల్యాండ్స్ పరిధిలోనివి కావని ధ్రువీకరించాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఫీల్డ్ వెరిఫికేషన్ మూడునెలల్లో పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ ద్వారా ఎక్కడా ప్రభుత్వ భూమికి నష్టం కలగవద్దని, అదేవిధంగా నీటి వనరులు కాలువలు, చెరువులు ఆక్రమణలకు గురికాకుండా అధికారులు చూడాలన్నారు. రాబోయే ఐదు రోజులపాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్క్రూటినీ పూర్తి చేసి పరిష్కరించాలన్నారు. భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లు ప్రతిపాదించిందని, దీనిపై జిల్లాల్లో ఆగస్టు 23, 24 తేదీల్లో వర్క్‌షాపులు నిర్వహించి ముసాయిదా బిల్లులో మార్పులు, సూచనలు తీసుకోవాలని కోరారు. ఈవీసీలో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, రాష్ట్ర నీటిపారుదల సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు అధికారులు పాల్గొన్నారు.

కక్కుర్తి 'కోతలు'

సిజేరియన్లకే సై

ప్రైవేటు ఆస్పత్రుల్లో తగ్గిన సాధారణ ప్రసవాలు



దేశంలో ఉన్న ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ప్రసవాల్లో 15శాతం మందికే శస్త్ర చికిత్సలు అవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు. కానీ, శస్త్రచికిత్సల (సిజేరియన్ల) శాతం రోజు రోజుకు పెరుగుతోంది. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో 65.72శాతంతో రాష్ట్రంలో అత్యధిక స్థానంలో ఉండటం గమనార్హం. అయితే ఇందుకు ఆరోగ్య పరిస్థితులు మాత్రం కారణం కాదు. ప్రైవేటు వైద్యులు కాసులకు కక్కుర్తిపడి ఇలా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

- జిల్లాలో మొత్తం కాన్పుల్లో 65.72శాతం సిజేరియన్లే
- రాష్ట్రంలోనే అత్యధికంగా ఖమ్మంలో నమోదు
- సఫలీకృతం కాని 'మార్పు' పథకం
- ప్రసవానంతరం అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలు
- కాసులకు కక్కుర్తిపడి సహజ ప్రసవాలపై ఆసక్తి చూపని ప్రైవేటు వైద్యులు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 20: ఒక వైపు శిశు మరణాల రేటు తగ్గించటం, మరోవైపు గర్భిణుల ఆరోగ్యం కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేస్తున్నాయి. ఇందుకోసం ఏటా కోట్లాది నిధులు వెచ్చిస్తున్నాయి. ప్రత్యేకించి ప్రస్తుతం రాష్ట్రంలో 'మార్పు' పథకం కూడా అమల్లో ఉంది. ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడటం, సాధ్యమైనంత వరకు సహజ ప్రసవాలు జరిగేలా చూడటం.. శస్త్ర చికిత్సలు తగ్గించాన్నది ఈ పథకం ముఖ్యఉద్దేశం. అయినా సఫలీకృతం కావట్లేదు. తాజా గణాంకాలే ఇందుకు నిదర్శనం. ప్రతీఏటా జరిగే ప్రసవాల్లో 65.72 శాతం మందికి శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు సమాచారం. అది ప్రైవేటు ఆస్పత్రుల్లోనే ఎక్కువగా జరుగుతుండడం విచిత్రం. జిల్లాలో మొత్తం 26 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా.. 4 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. మరో 6 ఆసుపత్రుల్లో 24 గంటల సేవలు ఉన్నాయి. వీటితో పాటు జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల అనుబంధ ఆస్పత్రి ఉంది. ప్రైవేటు ఆస్పత్రులు కూడా 300 లోపు ఉన్నాయి. వీటన్నింటిలో కలిపి ప్రతిఏటా దాదాపు 45 నుంచి 50 వేల ప్రసవాలు జరుగుతున్నాయి.

శస్త్ర చికిత్సలకే అధిక ప్రాధాన్యం

ప్రసవాల సమయంలో అత్యధికంగా ప్రైవేటులో శస్త్రచికిత్సలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వాస్తవానికి గతంతో పోలిస్తే ప్రస్తుతం సహజ ప్రసవాలు చేసే పరిస్థితులు లేవు. పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రమే సహజ ప్రసవం జరిగేందుకు ప్రయత్నిస్తున్నారు. పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అనస్తీషియాలు (మత్తు వైద్యులు) ఉండకపోవటంతో సహజ ప్రసవానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉన్నచోట అందుబాటులో లేకుండా సహజ ప్రసవం జరుగుతుందేమో నని ఎదురుచూసే పరిస్థితులు ఉన్నాయి. కానీ, ప్రైవేటులో ఇలాంటి పరిస్థితులు లేవు. సహజ ప్రసవానికి ఎక్కువ సమయం పడుతుండటం, పలు సమయాల్లో గర్భిణులు, శిశువుల ప్రాణాల మీదికి వస్తున్న నేపథ్యంలో జరగరానిది జరిగితే తమకు ఎక్కడ చెడ్డ పేరు వస్తుందోనని సాధ్యమైనంతవరకు శస్త్రచికిత్సలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇదిలా ఉంటే పలు వురు వైద్యులు అవసరం ఉన్నా, లేకున్నా ఎడా పెడా వారి వద్దకొచ్చే ప్రతీ కేసుని శస్త్రచికిత్స చేయటం ఆనవాయితీగా పెట్టుకున్నారు. 2023-24లో ఇప్పటి వరకు మొత్తం 5,475 వేల ప్రసవాలు జరిగితే ఇందులో ప్రైవేటులో 6667 సిజేరియను, 1634 సాధారణ కాన్పులు చేశారు. ఇది 80.32శాతం సీసెక్షన్ ఆపరేషన్లు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 3841 సాధారణ కాన్పులు, సిజేరియన్లు 3830 జరిగాయి. పది నెలల్లోనే 15,972 ప్రసవాల్లో 10,497 సిజేరియన్లు జరగడం గమనార్హం.

నోటీసులు ఏమైనట్లు?

ప్రసవాల్లో శస్త్రచికిత్సల శాతాన్ని తగ్గించాలని గతంలో ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అన్ని ప్రైవేటు ఆస్పత్రులకు నోటీసులు జారీచేశారు. విధిగా ప్రభుత్వ వైద్యులకు లక్ష్యాన్ని విధించారు. ప్రతీ నిత్యం ప్రగతిని పరిశీలించే విధానానికి గతంలో కలెక్టర్ పనిచేసిన సమయంలో శ్రీకారం చుట్టారు. కానీ కలెక్టర్ మారిపోవటం ఆ తర్వాత వచ్చిన జిల్లా అధికారులు దీనిపై దృష్టి పెట్టడం మరిచారు.

అత్యవసరమైతేనే...

ప్రసవాల సమయంలో అత్యవసరమైతేనే శస్త్రచికిత్సలు చేయాలి కానీ కొద్దిపాటి ప్రమాదం ఉందని తెలిసినా ముందు జాగ్రత్తగా శస్త్రచికిత్స అనివార్యమని పలువురు వైద్యులు 'కోత'లు చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా ఈ తరహా చర్యలకు పాల్పడుతున్నారు. సహజ ప్రసవం కోసం వేచి చూస్తే బిడ్డకు, తల్లికి జరగరానిది జరిగితే తమపై ఎక్కడ ఆరోపణలు వస్తాయనే అపోహ, భయం వైద్యుల్లో ఉంది. ఇలాంటి ఘటనలు జరిగిన చోట ఆసుపత్రులపై దాడులు జరుగుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. కానీ ముందస్తుగా గర్భిణి గురించి వారికి అన్ని విధాల అవగాహన కల్పించి సహజ ప్రసవం కోసం వేచి చూస్తే మంచిది. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

మహిళలకు ఇబ్బందికరమే



శస్త్ర చికిత్సల వల్ల మహిళలకు భవిష్యత్తులో ఆరోగ్యపర మైన సమస్యలు తప్పవని వైద్య నిపుణులు హెచ్చరిస్తు న్నారు. దేశ వైద్య నిపుణుల ఆధారంగా అత్యవసరమైతేనే తప్ప కేవలం 15 శాతం మందికి మాత్రమే శస్త్రచికిత్సలు చేయాల్సి వస్తుందని చెబుతున్నారు. ప్రసవాల సమయంలో మహిళకు ఇచ్చే మత్తు మందు నేరుగా వెన్నెముకకు ఇస్తారు. దీని ప్రభావం పది నుంచి 15 ఏళ్ల తర్వాత తప్ప నిసరిగా చూపిస్తుంది. కొందరిలో చాలా త్వరితగతిన చూపించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. దీని ప్రభావంతో తీవ్ర మైన దీర్ఘకాలిక నడుము నొప్పితో బాధపడాల్సి వస్తుంది.

ఆర్టీసీకి కాసుల పంట



- రాఖీపౌర్ణమి సందర్భంగా రూ.2.21 కోట్ల ఆదాయం
- ఖమ్మం రీజియన్‌లో 1.84 లక్షల మంది మహిళల ప్రయాణం
- అత్యధికంగా ఖమ్మం డిపో రూ.60.38 లక్షలు, అత్యల్పం ఇల్లెందు రూ.5.97 లక్షలు
- మహాలక్ష్మి పథకంతో భారీగా పెరిగిన ప్రయాణికులు

భద్రాచలం /ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 20: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఈ నెల 19న ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలో మొత్తం 2.87 లక్షలమంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు ప్రయాణం సాగించగా, అందులో 1.84 లక్షల మంది మహిళలు ఉండటం విశేషం. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలు గతంలో ఎన్నడూ లేనటువంటి రీతిలో ఈసారి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీ అదనంగా వంద బస్సులను నడపడం జరిగింది. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఈనెల 14 నుంచి 18 వరకు హైదరాబాద్ నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిసర ప్రాంతాలకు వచ్చిన ప్రయాణికులు 19న ఒక్క రోజే తిరుగుప్రయాణం చేయడంతో అధిక రద్దీ నెలకొంది. ఒకే రోజు రికార్డుస్థాయిలో 2.72లక్షల కిలోమీటర్లు ఆర్టీసీ బస్సుల ప్రయాణం సాగింది. వాస్తవానికి సగటున 2.41 లక్షల కి.మీ. బస్సులు తిరుగుతుండగా సోమవారం ఒక్క రోజే 32 వేల కి.మీ. అదనంగా తిరగడం జరిగింది. అలాగే ఖమ్మం రీజియన్‌కు రూ.2.21 కోట్ల ఆదాయం చేకూరింది. ఇందులో రూ.1.21 కోట్లు నగదు రూపేణ రాగా, రూ.1కోటి మహాలక్ష్మి కింద జమ అయింది.

అత్యధికం ఖమ్మం డిపో... అత్యల్పం ఇల్లందు

ఆర్టీసీ ఆదాయంలో డిపోల వారీగా చూస్తే ఖమ్మం డిపో అత్యధికంగా రూ.60.38 లక్షల ఆదాయం ఆర్జించగా 78,116 మంది ప్రయాణికులు ప్రయాణం చేశారు. ఇందులో 50,843 మంది మహిళలే. అలాగే భద్రాచలం డిపో రూ.42.91 లక్షలు ఆదాయం రాగా 41,804 మంది ప్రయాణికుల్లో 23,509 మంది మహిళలున్నారు. సత్తుపల్లి రూ.35.06లక్షలు రాగా 54,677 మంది ప్రయాణికుల్లో 33,674 మంది మహిళలున్నారు. మణుగూరు రూ.26.98 లక్షలు ఆదాయం రాగా 34,605 మంది ప్రయాణికుల్లో 24,004మంది మహిళలు ఉన్నారు. కొత్తగూడెం రూ.25.07లక్షలు రాగా 40,240 మంది ప్రయాణికుల్లో 29,252 మంది మహిళలున్నారు. మధిర రూ.24.08 లక్షలు ఆదాయం రాగా 28,594 మంది ప్రయాణం చేయగా అందులో 16,500 మంది మహిళలు ఉన్నారు. ఇల్లెందు రూ.5.97 లక్షల ఆదాయం రాగా 9,679 మంది ప్రయాణించగా అందులో 6,260 మంది మహిళలు ఉన్నారు.



అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి, సంక్షేమం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- అశ్వారావుపేట నియోజకవర్గ అధికారులతో సమీక్ష

6



రైతులకు బేషరతుగా రుణమాఫీ చేయాలి..

- నాగులవంచ ఏపీజీవీ బ్యాంకు ఎదుట రైతుల ఆందోళన

6

పగలు రెక్కీ.. రాత్రి చోరీ

- డోర్నకల్‌లో విద్యుత్ మోటార్ల చోరీ ముఠా అరెస్టు
- మహబూబాబాద్ ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ వెల్లడి
- నిందితులంతా ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసులే..




వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

డోర్నకల్(మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 20: పగలు రెక్కీ నిర్వహిస్తూ.. రాత్రివేళ వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటార్లను చోరీ చేస్తున్న ముఠాను పట్టుకున్నట్లు మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ వెల్లడించారు. డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన 10మంది ఓ ముఠాగా ఏర్పడి వ్యవసాయ మోటార్లను అపహరించుకుపోతున్నారని తెలిపారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద డోర్నకల్ సీఐ రాజేష్, ఎస్సై వంశీధర్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా మినీట్రక్ ద్వారా ఖమ్మానికి చెందిన కొట్టి గణేష్ (డ్రైవర్), అతడి స్నేహితుడు తేజావత్ సదర్‌లాల్ రెండు వ్యవసాయ మోటార్లను తరలిస్తున్నారు. అనుమానం వచ్చిన పోలీసులు ఆ వాహనాన్ని ఆపి తనిఖీ చేస్తుండగా, వారు పారిపోయేందుకు ప్రయత్నించారు. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, తాము మరికొందరితో కలిసి వ్యవసాయ క్షేత్రాల వద్ద పగలు రెక్కీ నిర్వహిస్తూ రాత్రి మోటార్లు అపహరించుకుపోతున్నట్లుగా పోలీసులకు తెలిపారు. విచారణలో భాగంగా వారి వద్ద మరో 17 మోటార్లు, రూ.70 వేల నగదు, రెండు ద్విచక్రవాహనాలను (స్కూటీ)లతో పాటు మోటార్లను తరలిస్తున్న మినీట్రక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న మోటార్ల విలువ రూ.4.54లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. వీరితో పాటు ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వేపకుంట్లకు చెందిన మొగిలి నాగరాజు, పువ్వాడ ఉదయ్‌నగర్‌కు చెందిన తేజావత్ జవహర్‌లాల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం గానుగపాడు గ్రామ శివారు అన్నారం తండాకు చెందిన ఇస్లావత్ సిద్ధు, వీరికి సహకరిస్తున్న ఖమ్మంలోని పాత ఇనుప దుకాణం యాజమాని వీరబోయిన ముత్యాలును అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులో మరో నలుగురు పరారీలో ఉన్నట్లు సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ తెలిపారు. సమావేశంలో మానుకోట డీఎస్పీ తిరుపతిరావు పాల్గొన్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఏఎస్సై కోటేశ్వర్‌రావు, కానిస్టేబుల్ సైదులు, శ్రవణ్, సోమేష్, కోటేశ్వర్‌రావులకు ఎస్పీ రివార్డులను అందించి, అభినందించారు.

కిన్నెరసాని జలాశయం నుంచి
ఐదువేల క్యూసెక్కుల నీరు విడుదల

405.20 అడుగులకు చేరిన నీటి మట్టం



పాల్వంచ రూరల్, ఆగస్టు 20 : మండలంలోని కిన్నెరసాని జలాశయంకు వరదనీరుచేరడంతో మంగళవారం 405.20 అడుగులకు నీటిమట్టం చేరింది. ప్రాజెక్టు అసలు సామర్థ్యం 407 అడుగులు కాగా వరదనీరు చేరుతుండటంతో గేట్లు ఎత్తి 5వేల క్యూసెక్కుల నీటిని విడుదలచేశారు.

నెలలో 7.8 టీఎంసీల నీరు విడుదల..

కిన్నెరసాని జలాశయానికి వరద ప్రవాహం పెరగడంతో ఒక్క నెలలో 28సార్లు గేట్లు ఎత్తారు. జూలై 20 నుంచి ఆగస్టు 20 వరకు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కిన్నెరసాని జలాశయానికి ఎప్పుడూ లేనంతగా వరదపోటెత్తింది. దీంతో జలాశయం అధికారులు ప్రాజెక్టు అసలు సామర్థ్యం అంచనా వేసుకుని గేట్లు ఎత్తి విడుదల చేశారు. మొత్తంగా ఒక నెలలోనే 7.8 టీఎంసీల నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేయడం జరిగింది.

భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా చర్యలు

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



భూనిర్వాసితులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 20: భూ నిర్వాసితులకు ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా అన్నిచర్యలు తీసుకోనున్నట్టు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చాంబర్‌లో ఖమ్మం- దేవరపల్లి నేషనల్ హైవే ధంసలాపురం భూ నిర్వాసితులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఖమ్మం- దేవరపల్లి నేషనల్ హైవే ప్రాజెక్టు, నగరాన్ని క్రాస్ చేసి ధంసలాపురం మీదుగా వెళుతుందన్నారు. దీనికోసం ధంసలాపురం వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను నేషనల్ హైవే ప్రతిపాదించిందన్నారు. 1.38 ఎకరాల భూసేకరణకు చర్యలు తీసుకుందని ఆయన అన్నారు. ఇందులో 14మంది రైతుల వ్యవసాయ, వ్యవసాయేతర భూములు ఉన్నట్లు తెలిపారు. గతంలో భూమి కోల్పోయిన వారికి మంచి ధర వచ్చేలా చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి, సాధ్యమైనంత వరకు అన్ని విధాల భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ సీహెచ్.స్వామి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రేషన్‌డీలర్లు

జిల్లాలో రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వివరించారు. డీలర్ల సంఘం నాయకులు బానోతు వెంకన్న, షేక్ జానీమియా తదితరులు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందించారు. అనంతరం పలు సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద కాంటాలు తక్కువ వస్తున్నాయని, బియ్యం సకాలంలో విడుదల కాకపోవడం వల్ల లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారని వివరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వర్కింగ్ ప్రెసిడెంట్ దొండ దుర్గయ్య, బాబూరావు తదితరులున్నారు

నేడు జిల్లాలో
మంత్రులు తుమ్మల, పొంగులేటి పర్యటన

ఖమ్మం సంక్షేమ విభాగం/ నేలకొండపల్లి, ఆగస్టు 20: మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు బుధవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు మంగళవారం పర్యటన వివరాలను ఆయా క్యాంపు కార్యాలయాల నుంచి విడుదల చేశారు. ఖమ్మం ఐటీ హబ్ నుంచి సీఆర్‌జీ టవర్స్ వరకు నిర్మాణం జరగనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన చేయనున్నారు. నేలకొండపల్లిలో భక్తరామదాసు ధ్యానమందిరం ఆవరణలో నిర్మించిన ఆడిటోరియాన్ని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు ప్రారంభించనున్నారు.

నేడు ఉపముఖ్యమంత్రి భట్టి పర్యటన

ఎర్రుపాలెం, ఆగస్టు 20: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఎర్రుపాలెం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. మండలంలో మీనవోలు నుంచి బనిగండ్లపాడు వరకు రూ.కోటి 70లక్షలు, ఎర్రుపాలెం-పెగళ్లపాడు రోడ్‌వరకు రూ.2కోట్ల40లక్షలు, కొత్తపాలెం-గట్ల గౌరవరం వరకు రూ.20కోట్లు, ఎర్రుపాలెం-రాజుపాలెం వరకు రూ.25కోట్లు, వెంకటాపురం-బుచ్చిరెడ్డిపాలెం వరకు రూ.6కోట్లు, బుచ్చిరెడ్డిపాలెం-వెంకటాపురం వరకు రూ.2కోట్ల20లక్షలు, నారాయణపురం-రాజుపాలెం రోడ్డు వరకు రూ.95లక్షలు, రాజుపాలెం-కొత్తపాలెం వరకు రూ.ఒక కోటి 60లక్షల వ్యయంతో నిర్మించే రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జిలతో ప్రత్యేక సమావేశంలో పాల్గొంటారు. తమ అభిమాన నాయకుడికి ఘనస్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు స్వాగత ఏర్పాట్లు చేశారు.

కొవ్వూరు రైల్వే లైన్ పనులు ప్రారంభించాలి

విలేకరుల సమావేశంలో సాధన కమిటీ కన్వీనర్ కొదమసింహం పాండురంగాచార్యులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సాధన కమిటీ కన్వీనర్ పాండురంగాచార్యులు

చుంచుపల్లి, ఆగస్టు 20: కొవ్వూరు రైల్వే లైన్ మంజూరు చేసినప్పటికీ వాటి పనులు ప్రారంభించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తక్షణమే ఆ రైల్వే లైన్ పనులను ప్రారంభించాలని సాధన కమిటీ కన్వీనర్ కొదమసింహం పాండురంగాచార్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం రైటర్ బస్తీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలను కలుపుతూ మంజూరు చేసిన కొవ్వూరు రైల్వేలైన్ అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి కొవ్వూరు రైల్వేలైన్‌ను సాధించుకున్నామని, కానీ రైల్వేలైన్ నిర్మించడంలో ఆ పనులను ప్రారంభించుకోవడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఈ నూతన రైల్వే నిర్మాణం కొరకు గత ఉమ్మడి రాష్ట్రాల ఇరువురు సీఎంలు పట్టించుకోలేదని గుర్తు చేశారు. ఈ రైల్వే నిర్మాణం పనులు ప్రారంభించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలనుంచి అనుమతితో కూడిన పత్రాలను రైల్వే బోర్డుకు అందజేయాలన్నారు. ఈ మేరకు ఇటీవలే ఖమ్మం ఎంపీ రఘురామరెడ్డి, తెలంగాణ మంత్రులు ఇరువురి రాష్ట్రాల సీఎంల దృష్టికి ఈ రైల్వే లైన్ సమస్యను తీసుకెళ్లి చర్చించినట్లు గుర్తు చేశారు. అదేవిధంగా కొత్తగూడెం రైల్వేస్టేషన్ నుంచి షిర్డీకి, తిరుపతి ప్రాంతాలకు రైలు సర్వీసును ఏర్పాటు చేయాలన్నారు. గతంలో రైల్వే బోర్డు పరిధిలో ఉన్న పుణ్య క్షేత్రం నుంచి ఏదైనా వేరే పుణ్య క్షేత్రాలకు ఉండేదని తెలిపారు. ఆ ప్రతిపాదన మేరకే షిర్డీ, తిరుపతిలకు ప్రత్యేక రైలు సర్వీస్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా కరోనా ముందు నడిచిన ప్యాసింజర్ రైలు అన్నింటిని తిరిగి పునఃరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చలం, పవన్‌కళ్యాణ్, కల్లూరి కృష్ణ, సతీష్, సుమన్, పాల్గొన్నారు.

బీజేవైఎం రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్
సభ్యుడిగా రాఘవ

బోనకల్, ఆగస్టు 20: బీజేవైఎం రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ సభ్యుడిగా బోనకల్ గ్రామానికి చెందిన యార్లగడ్డ రాఘవ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చేవేళ్ల మహేందర్ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారికి ప్రధాని మోదీ అంత్యంత ప్రాధన్యత ఇస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. పార్టీ బలోపేతానికి అంకిత బావంతో పని చేస్తానని తెలిపారు. తనకు పదవి ఇచ్చినందుకు గానూ తమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చేవేళ్ల మహేందర్, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీదర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంతుల ఉపేందర్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయ శాఖ ఏడీఏ బదిలీ



మధిరటౌన్, ఆగస్టు 20: గత ఐదేళ్లుగా మధిర వ్యవసాయ శాఖ ఏడీఏగా పనిచేస్తున్న కొంగర వెంకటేశ్వరరావు ఖమ్మం అర్బన్ ఏడీఏగా బదిలీ కాగా సోమవారం రాత్రి అయనకు బదిలీ ఉత్తర్వులు అందాయి. ఐదేళ్లుగా మధిర వ్యవసాయ శాఖ ఏడీఏగా పనిచేసిన వెంకటేశ్వరరావు ఇటు రైతులతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారుల మన్ననలు పొందారు. రైతు కు సబ్సీడీపై ట్రాక్టర్లు అందజేయడంతోపాటు కరెంటు మోటార్లు, ఆయిల్ ఇంజన్లు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను కూడా సబ్సిడీపై అందించడంలో మధిరను జిల్లాలోనే ముందంజలో నిలిపారు. గత సంవత్సరం బోనకల్ మండలంలో అకాలవర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటలకు నష్టపరిహారం ఇప్పించడంలో కూడా సమర్థవంతంగా పనిచేశారు, మధిర డివిజన్ పరిధిలోని అన్ని క్లస్టర్లలో రైతు వేదికలను నిర్మింపచేసి వాటిని ప్రారంభింప చేసి ఉపయోగంలోకి తెచ్చారు. ఆయన స్థానంలో కూసుమంచి ఏడీఏగా పనిచేస్తున్న విజయచంద్ర మధిర ఏడీఏగా రానున్నారు.



'రిస్క్' టీజర్‌ను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం

కళాకారులను ప్రోత్సహిస్తాం

- 'రిస్క్' సినిమా టీజర్‌ను విడుదల చేసిన డిప్యూటీ సీఎం భట్టి
- మరోసారి చలనచిత్రాల వైపు కొత్తగూడెం కళాకారులు

చుంచుపల్లి, ఆగస్టు 20: కళాకారులను ప్రోత్సహిస్తామని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదారాబాద్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ప్రముఖ సినీ, సంగీత దర్శకుడు గంటాడి కృష్ణ నిర్మిస్తూ దర్శకత్వం వహిస్తున్న రిస్క్ టీజర్‌ను డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. నూతన నటీ నటులతో నిర్మిస్తున్న ఈ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఈ చిత్ర నిర్మాణం ఉండాలన్నారు. గతంలో అనేక మెలోడీ, హిట్ సినిమాలు అందించిన గంటాడి కృష్ణను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బండ్ల గణేష్, భద్రాద్రి జిల్లా సినీ కళాకారులు, అభ్యుదయ కళా సేవా సమితి సభ్యులు మద్దెల శివకుమార్, సినీ హీరో సాయిరాంశంకర్, నటీనటులు సందీప్, ఆమని, కుసుమ భోగరాజు, సాయి, నరేందర్ పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

వసతిగృహ సంక్షేమ అధికారులు
సమర్థవంతంగా పనిచేయాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 20: వసతిగృహ సంక్షేమ అధికారులు తమ విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ వసతి గృహాల సంక్షేమ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే బాధ్యత సంక్షేమ అధికారులదే అన్నారు. విద్యార్థుల బాగోగులు చూస్తూ, వారిని జాగ్రత్తగా, తమ పిల్లల్లా చూసుకోవాలన్నారు. సూచించిన సమయంలో తప్పకుండా వసతి గృహంలోనే ఉండాలన్నారు. విద్యార్థుల రోజువారి హాజరు పర్యవేక్షణ చేయాలన్నారు. మౌలిక వసతులు, పరిశుభ్రత పాటించాలన్నారు. సంక్షేమ అధికారి, సిబ్బంది, విద్యార్థులకు సంబంధించి మూమెంట్ రిజిష్టర్ నిర్వహించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఆరోగ్యరీత్యా జాగ్రత్తలు తీసుకోవాలని, మెడికల్ చెకప్‌లు చేయించాలని ఆదేశించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించి పిల్లల పురోగతిని వివరించాలన్నారు. పాఠ్యేతర కార్యకలాపాలు చేపట్టి, అన్ని విధాలా చురుకుగా తయారయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు వసతి గృహాల ఆకస్మిక తనిఖీలు చేపడతారని, లోపాలుంటే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి కె.సత్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి విజయలక్ష్మి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి జ్యోతి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎం.ఏ.మహమూది, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, సహాయ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి..



పాల్వంచ, ఆగస్టు 20: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్ 5,6 దశల్లో మంగళవారం విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. 9వ యూనిట్‌లో సోమవారం అర్ధరాత్రి బాయిలర్ ట్యూబ్ లీకవడంతో అధికారులు యూనిట్‌ను నిలిపి వేశారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. మరమ్మతు పనులు పూర్తి చేసి బుధవారం యూనిట్‌ను పునరుద్ధరిస్తామని 5,6 దశల సీఈ ప్రభాకరరావు తెలిపారు.

విద్యార్థినిని వేధించిన ఆకతాయి అరెస్టు

- పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు
- వివరాలు వెల్లడించిన తొర్రూర్ డీఎస్పీ సురేష్

నర్సింహులపేట, ఆగస్టు 20: పాలిటెక్నిక్ విద్యార్థినిని ప్రేమపేరుతో వేధించి, ఆమె బలవన్మరణానికి కారణమైన ఆకతాయిని పోలీసులు అరెస్టు చేసి, మంగళవారం తొర్రూరు కోర్టులో హాజరు పరిచారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డీఎస్పీ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని (17) సూర్యాపేట జిల్లా కోదాడలో పాలిటెక్నిక్ డిప్లొమా చదువుతోంది. ఖమ్మం జిల్లాలోని వైరాకు చెందిన 17ఏళ్ల ఆకతాయి (మైనర్) ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకోవాలని ఆమెను తరుచూ వేధిస్తున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆ విద్యార్థిని ఈనెల 15వ తేదీన ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మహబూబాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి.. 16న నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు ఇచ్చిన ఫిర్యాదుతో పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, భరోసా సెంటర్‌కు అనుసంధానం చేశారు. మహబూబాబాద్ ఉమెన్ ఎస్ఐ పోక్సో చట్టం ప్రకారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలి నుంచి వాంగ్మూలం సేకరించి ఎస్సీ, ఎస్టీ (పీవోఏ) సెక్షన్లను జోడించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే 17వ తేదీన మహబూబాబాద్ జిల్లా మెజిస్ట్రేట్ కూడా మరణ వాంగ్మూలం తీసుకున్నారని, ఆ మరుసటి రోజైన 18న ఆమె చికిత్స పొందుతూ మృతి చెందినట్టు డీఎస్పీ సురేష్ వివరించారు. బాధితురాలు మరణ వాంగ్మూలం ప్రకారం దర్యాప్తు చేసి మంగళవారం ఉదయం తొర్రూరు బస్టాండ్ వద్ద నిందితుడిని అదుపులోకి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు తెలిపారు.

రజకులకు రక్షణ కల్పించాలి

● రజకవృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు



అంబేద్కర్ సెంటరులో నిరసన తెలుపుతున్న నాయకులు

పాల్వంచ టౌన్, ఆగస్టు 20: రజకులకు రక్షణ కల్పించాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిగొండ రాంబాబు అన్నారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి గ్రామంలో గ్రామ పెత్తందారులు రజకులను సాంఘీక బహిష్కరణ చేయడాన్ని నిరసిస్తూ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ సెంటరులో నిరసన చేపట్టి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ 8 నెలలుగా జక్రాన్‌పల్లి గ్రామ రజకులను సాంఘీక బహిష్కరణకు పాల్పడిన పెత్తందారులను అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిటికెన మునలయ్య రామతులసి, యాదగిరి, భిక్షం, రామబ్రహ్మం, రమేష్ శ్రీను, ఉపేందర్, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి, సంక్షేమం

- అటవీ, రెవెన్యూ శాఖల మధ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బృందాలు
- ఇందిరమ్మ ఇళ్లు, అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు
- క్షేత్రస్థాయి ఉద్యోగులు, వైద్యులు స్థానికంగా ఉండాలి
- రెవెన్యూ గృహనిర్మాణ శాఖామంత్రి పొంగులేటి
- అశ్వారావుపేట నియోజకవర్గ అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

అశ్వారావుపేట, ఆగస్టు 20: ప్రజలకు సేవ చేయాలన్నా, సంక్షేమ పథకాలు ప్రజలకు అందించి, మెరుగైన సేవలు అందించాలన్నా ప్రజా ప్రతినిధులతోపాటు అధికారుల భాగస్వామ్యం చిత్తశుద్ధిగా ఉన్నప్పుడే పరిపూర్ణమవుతుందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులు, వైద్యులు, మండలస్థాయి అధికారులు స్థానికంగా ఉండి విధులు నిర్వర్తించినప్పుడే ఇది సాధ్యమవుతుందని అన్నారు.

అశ్వారావుపేట పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో మంగళవారం నియోజకవర్గస్థాయి అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, పలువురు జిల్లా అధికారులతో కలిసి వివిధ శాఖల అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమీక్షించారు.

ఈ సమావేశంలో ప్రధానంగా ఆంధ్రజ్యోతి జిల్లా పేజీలో మంగళవారం ప్రచురితమైన కన్నాయిగూడెం రెవెన్యూ భూ వివాదంపై మంత్రి పొంగులేటి ఆరా తీశారు. కన్నాయిగూడెం రెవెన్యూ పరిధిలో 29వేల ఎకరాల సాగు భూమిని ఏడు దశాబ్దాలుగా గిరిజనులు సాగు చేసుకుంటున్నారని, అటవీ-రెవెన్యూశాఖల మధ్య వివాదంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని, అశ్వారావుపేటలో వేలాది ఎకరాల అసైన్‌మెంట్ భూముల్లో పట్టాలు ఒకరి పేరున, ఎంజాయ్‌మెంట్‌లో ఒకరు ఉన్న విషయాలతో పాటు, నియోజకవర్గ సమస్యలపై ప్రత్యేక కథనం వెలువడింది.

వీటిపై మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే ఆదినారాయణ ప్రత్యేకంగా రెవెన్యూ అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అటవీ, రెవెన్యూశాఖల మధ్య వివాదాలు, ఎంజాయ్‌మెంట్ సర్వే, సమస్యలున్న భూములను గుర్తించి, శాశ్వత పరిష్కారం చేసేందుకు అవసరమైన సర్వేయర్లు, ఇతర సిబ్బందిని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పంపడం జరుగుతుందని మంత్రి ప్రకటించారు. కలెక్టర్ పర్యవేక్షణలో రెవెన్యూ, అటవీశాఖాధికారులు సమన్వయంతో ఈ సమస్యలు పరిష్కరించాలన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి, అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లను అశ్వారావుపేట నియోజకవర్గంలో మంజూరు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలోని అర్హులైన రైతులందరికీ రూ.31వేల కోట్ల రుణమాఫీని చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఇప్పటికే రూ.19వేల కోట్లు చేశామని, అర్హులైన వారందరికీ మాఫీ చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కాగా, తాను వివిధ అంశాలపై అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పని ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరెడ్డిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్రామాలలో జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని వైద్యులు, పంచాయతీ అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని సంబందిత అధికారులు అప్రమత్తమై పని చేయాలని, ఏ అవసరం వచ్చినా కలెక్టర్‌ను సంప్రదించి పనిచేసుకోవాలని సూచించారు. ఎన్ని నిధులు ఇవ్వటానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు తెలియకుండా మహిళా శక్తి రుణాలు, ఇతర పథకాలు అమలు చేయడంపట్ల సంబంధిత అధికారులపై మంత్రి అసహనం వ్యక్తం చేసారు. ఎమ్మెల్యే, కలెక్టర్ అనుమతులతోనే అమలు చేయాలని సూచించారు.

గ్రామాలలో హైటెన్షన్ వైర్లు ఇళ్లపై నుంచి వెళుతున్నాయని, లైన్ల విస్తరణపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నిధులు అవసరమైతే తనను నేరుగా కలవవచ్చునని అన్నారు. సమావేశంలో మువ్వా విజయ్‌బాబు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా....
రుణమాఫీ అమలు చేయాలి

నాగులవంచ ఏపీజీవీ బ్యాంకు ఎదుట రైతుల ఆందోళన



నాగులవంచ ఏపీజీవీ బ్యాంకు ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

చింతకాని, ఆగస్టు 20: రుణమాఫీ విషయంలో ప్రభుత్వం తాత్సార్యం చేస్తోందని, ఎటువంటి షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలని కోరుతూ మంగళవారం మండల పరిధిలోని నాగులవంచ ఏపీజీవీ బ్యాంకు ఎదుట రైతులు ఆందోళన నిర్వహించారు. నాగులవంచ ఏపీజీవీ బ్యాంకు పరిధిలోని 7 గ్రామాలకు చెందిన సుమారు 100మంది రైతులు అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనలో పాల్గొన్నారు. బ్యాంకు ప్రధాన ద్వారానికి తాళం వేసి బ్యాంకు ఎదుట సుమారు రెండు గంటలపాటు భైఠాయించి తమ నిరసన వ్యక్తం చేశారు.

రుణమాఫీ విషయంలో ప్రభుత్వం రైతులను ఇబ్బందులు పెడుతుందన్నారు. వివిధ కారణాలను సాకుగా చూపిస్తూ రైతులకు రుణమాఫీ దూరం చేస్తోందన్నారు. ప్రభుత్వం దగ్గర ప్రతి రైతుకు సంబంధించిన సమాచారం ఉందని దాన్ని పరిగణలోకి తీసుకుని రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ జాబితాలో పేర్లు ఉన్నా ఇప్పటి వరకు కొంతమంది రైతులకు వారి ఖాతాలో నగదు జమ చేయలేదన్నారు. రెండు లక్షలకు పైన ఉన్న రైతులకు సంబంధించి రుణమాఫీ విషయంలో రైతులు ఆపై మొత్తాన్ని చెల్లించిన తరువాత రుణమాఫీ నగదును రైతుల ఖాతాల్లో జమ చేయడంపై రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, దీని ద్వారా బ్యాంకులు లాభం పొందడమే కాకుండా రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

ఇప్పటికే చాలామంది రైతులు అప్పులు తెచ్చి తమ రుణాల్ని రెన్యూవల్ చేశారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించి రెండు లక్షలకు పైన ఉన్న రైతుల నగదును వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని కోరారు. రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా వ్యవసాయ రుణం ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. రుణమాఫీ విషయం రైతులకు సంబంధించిందని ఇందులో రాజకీయ జోక్యం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు వంకాయలపాటి సత్యనారాయణ, కోలేటి నాగేశ్వరరావు, సామినేని బాబురావు, నాగేశ్వరరావు, వీరబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం ఓటరు జాబితా సవరణ

- 20 నుంచి అక్టోబరు 18 వరకు ఇంటింటి పరిశీలన
- జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రకటన
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 20: ఓటరు జాబితా సవరణ 2025 ప్రక్రియ షెడ్యూల్ ప్రకారం పూర్తిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం రెవెన్యూ అధికారులతో ఓటరు జాబితా సవరణ, ప్రజావాణి అర్జీల పరిష్కారంపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హత ఉన్న ప్రతీఒక్కరు ఓటుహక్కు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 20నుంచి అక్టోబర్ 18 వరకు బూత్‌స్థాయి అధికారులచే ఇంటింటి పరిశీలన చేయనున్నట్టు తెలిపారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, సెక్షన్ల రీకాస్టింగ్ తదితర ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. అక్టోబరు 19 నుంచి 28 వరకు ఫార్మాట్ 1నుంచి 8ల తయారు, ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ రోల్ తయారు చేయాలన్నారు. అక్టోబరు 29న ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ పబ్లికేషన్ చేయాలన్నారు. అక్టోబరు 29నుంచి నవంబరు 28వరకు అభ్యంతరాలు స్వీకరించాలని, డిసెంబరు 24 లోగా అభ్యంతరాల పరిష్కారం చేపట్టాలని, 6 జనవరి, 2025న తుది ఎలక్టోరల్ రోల్ పబ్లికేషన్ చేయాలని కలెక్టర్ తెలిపారు.

బూత్‌స్థాయి అధికారుల ఖాళీలు ఉంటే వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. నియామకంలో మార్గదర్శకాలు పాటించాలన్నారు. ఇంటింటి ధ్రువీకరణ లో జాగ్రత్తలు తీసుకోవాలని, 10మంది కంటే ఎక్కువ ఉన్న ఇంట్లో కొత్త వారి నమోదు, లేనివారి తొలగింపు నిబంధనల మేరకు చేయాలన్నారు. కొత్త ఓటర్ల నమోదులో 1 జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండే వారిని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. దరఖాస్తుల ఆమోదం, తిరస్కరణలకు సంబంధించి ఆధారాలు పటిష్టంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలు ప్రైవేటు భవనాల్లో ఉన్నవి, ప్రభుత్వ భవనాల్లో ఉండి, శిథిలావస్థలో ఉన్నవి, ఓటర్లకు 2 కి.మీ. దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రాల మార్పుకు సంబంధించి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.

మండలస్థాయి ప్రజావాణి కార్యక్రమానికి స్పందన బాగుందని, కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలు చాలా తగ్గాయని కలెక్టర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా అర్జీల సమర్పణ పెరిగిందని, నమ్మకంతో వచ్చే అర్జీదారులకు న్యాయం చేయాలని ఆయన అన్నారు. ప్రజావాణిలో మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని, హాజరు నివేదికలో అధికారి స్థాయి పొందుపర్చాలని ఆయన తెలిపారు. శుక్రవారం వరకు వచ్చిన అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులు అధికారుల స్పందనతో సంతృప్తి చెందేలా చూడాలని ఆయన అన్నారు. మండల అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో ప్రజాపాలన కౌంటర్ల పునరుద్ధరణ చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, ఇన్‌చార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్, జిల్లాలోని తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు దేవుడితో సమానం

▸▸ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



వినాయకపురంలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి, ఎంపీ రఘు రాంరెడ్డి

ములకలపల్లి, ఆగస్టు 20: వైద్యులు దేవుడితో సమానమని, ప్రజలకు సేవ చేసేందుకే వైద్యులు ఉన్నారని రెవెన్యూ, హౌసింగ్ సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మంగపేట గ్రామంలో రూ.1.56లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌తో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు మంత్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అన్ని గదులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పంచాయతీరాజ్ అధికారులతో ఇంకా చేయాల్సిన భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా వైద్య శాఖాధికారులతో మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కావాల్సిన పరికరాలు, మందు లు, సిబ్బంది తదితర అవసరాలకు సంబంధించి నివేదికలు కలెక్టర్‌కు అందజేయాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులతో మా ట్లాడుతూ వైద్యులు దేవుడితో సమానమని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో అన్ని సౌకర్యాలు కల్పించి అభివృద్ధిపర్చాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే మళ్లీ పరిశీలనకు వస్తానని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వ విజయ్‌బాబు, కొత్తగూడెం ఆర్డీవో మధు, జిల్లా వైద్య అధికారి భాస్కర్‌నాయక్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎలను రెగ్యులర్ చేసి సర్వీస్‌ను క్రమబద్ధీకరణ చేయాలని, వేతనం రూ.58వేలు చెల్లించాలని ఏఎన్ఎంలు అనిత, జ్యోతి, అరుణ, రమాదేవి మంత్రి పొంగులేటిని కోరారు. అదేవిధంగా పంచాయతీ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ వర్కర్స్ వినతిపత్రం అందజేశారు. మాదారం నుంచి వయా కమలాపురం నుంచి జగన్నాథపురం వరకు రహదారిపై ఉన్న బ్రిడ్జిలను నిర్మించాలని గ్రామస్థులు తెలిపారు. ములకలపల్లి నుంచి తాళ్లపాయికు సైడ్ డైవర్షన్ రహదారి నిర్మాణం కల్పించాలని, తాళ్లపాయి పంచాయతీ గ్రామస్థులు వగ్గెల వీరస్వామి, కీసరి కృష్ణ, కోండ్రు అనీల్ తదితరులు వినతిపత్రం అందజేశారు.

అశ్వారావుపేట రూరల్: రాష్ట్రంలో త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికీఇందిరమ్మ గృహాలను మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెనూ, గృహనిర్మాణ, సమాచారాశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అశ్వారావుపేట మండలంలో మంగళవారం ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి విస్తృతంగా పర్యటించారు. మండలంలోని సున్నంబట్టి గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం నారాయణపురం, వినాయకపురంలో పంచాయతీ భవనాలను మంత్రి పొంగులేటి ప్రారంభించారు. తిమ్మాపురంలో అటవీశాఖ అధికారులు తాము సాగుచేసుకుంటున్న భూములను లాక్కుంటున్నారని, తమకు న్యాయం చేయాలని ఆగ్రామ గిరిజనులు మంత్రిని వేడుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేస్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, తెలంగాణా ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, జూపల్లి రమేశ్ తదితరులున్నారు.

వరద బాధితులతో పాటు రామ భక్తులకు ఆశ్రయం

▸▸ సేవ్ భద్రాద్రి అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్ వెల్లడి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దుర్గాప్రసాద్

భద్రాచలం, ఆగస్టు 20: భద్రాచలంలో ప్రతి ఏటా సంభవించే వరదల సమయంలో వరద బాధితులకు పునరావాసంతో పాటు, రామ భక్తులకు అందుబాటులో ఉండే విధంగా మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఈ నెల 28న శంకుస్థాపన చేయనున్నట్లు సేవ్ భద్రాద్రి సంఘం అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్ తెలిపారు. భద్రాచలంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రాచలానికి శాశ్వత వరద పునరవాస కేంద్రం అవసరమని భావించి దాని నిర్మాణం కోసం ఇప్పటికే రూ.34 లక్షల నగదు విరాళాల రూపంలో సేకరించామని తెలిపారు. కేరళ వరదల సమయంలో సైతం భద్రాచలం నుంచి రూ.20 లక్షలు వసూలు చేసి ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. అదే స్పూర్తితో ఇప్పుడు భద్రాచలంలో ఈ నెల 28న గోదావరి వారధి సమీపంలోని అభయాంనేయస్వామి దేవస్థానం ప్రాంగణంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్కే. అజీమ్, నర్సారెడ్డి, గాదె మాధవరెడ్డి, బి. వెంకటరెడ్డి, పరిమి సోమశేఖర్, చారుగుళ్ల శ్రీనివాస్, కంభంపాటి సురేష్, బి.హరిశ్చంద్రనాయక్, టివి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా టీఎన్జీవో కన్వీనర్‌గా సత్యనారాయణ

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 20: టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా కమిటీని పునరుద్ధరిస్తున్నట్లు టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ గౌడ్ ప్రకటించారు. మంగళవారం ఖమ్మం టిఎన్జీవోస్ ఖమ్మం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కార్యవర్గాన్ని రద్దు పరచడానికి గల కారణాలను వివరించారు. కొన్ని ప్రత్యేకమైన పరిస్థితుల దృష్ట్యా జిల్లా యూనియన్‌ను రద్దుపరిచి అడ్‌హాక్ కమిటీ నియమిస్తున్నట్లు వెల్లడించారు. తొమ్మిది మంది సభ్యులతో కూడిన కమిటీని ప్రకటించారు. కన్వీనర్‌గా టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ గౌడ్, కో కన్వీనర్‌లుగా కొనిదెన శ్రీనివాస్, ఆర్వీఎస్ సాగర్, సభ్యులుగా కొమరగిరి దుర్గాప్రసాద్, జడ్ ఎస్ జైపాల్, శ్రీధర్ సింగ్ కే. లలిత కుమారి, నందగిరి శ్రీనివాస్‌లను సభ్యులుగా ఎన్నుకున్నట్లుగా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా నాయకులు గుంటుపల్లి శ్రీనివాస్, యర్రా రమేష్, తాళ్లూరి శ్రీకాంత్, సగ్గుర్తి ప్రకాష్‌రావు, పెద్దినేని రాధాకృష్ణ, భూసచంద్రశేఖర్, హరికృష్ణ, డీఆర్డీవో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జంగం లక్ష్మణరావు, ప్రభుత్వ వైద్యశాల రవికుమార్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ముభిత్ మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల దూరం

● డీఎంహెచ్‌వో సుబ్బారావు



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బారావు

చింతకాని, ఆగస్టు 20: విష జ్వరాల వ్యాప్తి పట్ల ప్రజలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి వరికూటి సుబ్బారావు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలను పరిశీలించి రోగుల ఆరోగ్య పరిస్థితులపై వారితో మాట్లాడారు. నేరడ, కోమట్లగూడెం గ్రామాల్లో విషజ్వరాల వ్యాప్తి అధికంగా ఉండటంతో జ్వర పీడితుల ఇళ్లకు వెళ్లి రోగులతో మాట్లాడారు. హెల్త్ క్యాంపులలో రోగులకు అందుతున్న చికిత్స, మందులు తదితర విషయాలపై సిబ్బందితో చర్చించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. ప్రతి ఇంట్లో డ్రైడే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అల్తాఫ్, పీడీఎమ్‌వో సోహేల్, ఏఎన్ఎం పద్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

280 కిలోల గంజాయి పట్టివేత

▸▸ ఆరుగురు నిందుతుల అరెస్టు ▸▸ సరఫరాదారులపై కేసు నమోదు ▸▸ వివరాలు వెల్లడించిన ఎస్పీ రోహిత్‌రాజ్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

అశ్వారావుపేట/దమ్మపేట, ఆగస్టు 20: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో 280కేజీల గంజాయి పట్టుబడింది. ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.కోటి ఎనభై లక్షల ఉంటుంది. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజు వివరాలు వెల్లడించారు. దమ్మపేట మండలంలోని అచుతాపురం-మందలపల్లి మధ్య అచుతాపురం క్రాస్‌రోడ్ వద్ద మంగళవారం మధ్యాహ్నం దమ్మపేట ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి, సీసీఎస్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ డీసీఎం వ్యాన్‌ని తనిఖీ చేయగా దాని కింద భాగంలో గంజాయి ప్యాకెట్లును అమర్చి పైన కెమికల్ లోడ్ కనిపించేలా ఏర్పాటు చేసి గంజాయి రవాణా చేస్తున్న విషయం బయటపడింది. మొత్తం 280కేజీల గంజాయిని 247 ప్యాకెట్లులో ప్యాక్ చేసి తరలిస్తున్నారు. దాంతో పోలీసులు ఆ గంజాయి ప్యాకెట్లతో పాటు వ్యాన్‌ను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న మహారాష్ట్రకు చెందిన ధ్యానేశ్వర్ విఠా జాదౌవ్ (గంజాయి కొనుగోలు దారు), ఆశిమ్ అసద్‌షేక్, షాలిక్ ఫిరోజ్ బబ్లూ, అబ్దుల్ రెహ్మాన్‌లాల్ అహ్మద్, వ్యాన్ డ్రైవర్ అజీజ్ సయ్యద్, సరఫరాదారు శ్రీనులను అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. వీరితో పాటు సరఫరాదారులు ప్రకాశ్ ధ్యానేశ్వర్, అబ్దుల్ రెహ్మాన్, ఉస్మాన్ దారోగ, మోహితే జయసింగ్, మోహితే నందు, పండిట్ మంగల్ మోహిత్‌లపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరు పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన గంజాయిని ఓడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా దమ్మపేట మండలంలో పట్టుబడింది. విలేకరుల సమావేశంలో అశ్వారావుపేట సీఐ కరుణాకర్, టాస్క్‌ఫోర్స్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ ప్రవీణ్, దమ్మపేట ఎస్ఐ సాయి కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

పనికి వెళ్దాం అని చెప్పి.. మహిళపై లైంగిక దాడి

● పోలీసులకు ఫిర్యాదు..కేసు నమోదు

ఖమ్మంక్రైం, ఆగస్టు20: ఇళ్లు బూజు దులిపే పని ఉందని చెప్పి, తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఓమహిళ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. బాధిత మహిళ, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...నగరంలోని పాండురంగాపురానికి చెందిన 42 ఏళ్ల మహిళకు ఈనెల 12న తన ఇంటి పక్కన అద్దెకు ఉంటున్న ఓ మహిళ ఫోన్ చేసింది. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద అడ్డాలో ఉన్నానని, బూజు దులిపే పని ఉన్నదని పనికి రమ్మని చెప్పింది. దీంతో అక్కడకు సదరు మహిళ వెళ్లింది. కాగా అక్కడకు ఓవ్యక్తి వచ్చి ద్విచక్ర వాహనంపై ఆ ఇద్దరు మహిళలను ఎక్కించుకుని చింతకాని నామవరం రోడ్డులోని గండసిరి మీదుగా పెద్ద మండవ సమీప ప్రాంతానికి తీసుకువెళ్లాడు. మధ్యలో ఓ మద్యం దుకాణం వద్దకు వెళ్లి మద్యం, కూల్ డ్రింక్స్ తీసుకుని వచ్చారు. పెద్దమండవ సమిప ప్రాంతంలో ఎవ్వరు లేని చోటకు తీసుకువెళ్లి, ఆ మహిళ, వ్యక్తి ఇద్దరు కలిసి మద్యం సేవించారని పేర్కొంది. తనని కూడా తాగాలని అడగగా, పనికి అని చెప్పి ఇదంతా ఎంటి, నేను వెళ్లిపోతానని చెప్పగా, వెళదాం ఉండమని చెప్పారని ఫిర్యాదులో పేర్కోంది. కొంత సేపటి తరువాత ఆ మహిళ సదరు మహిళతో వచ్చిన వ్యక్తితో ఉండాలని, లేదంటే చంపుతామని బెదిరించారు.

తాను వెళ్లిపోతానని వదిలిపెట్టండి అనగా, నీబిడ్డని కూడా చంపేస్తాం అంటూ గొంతు పట్టుకుని, దాడి చేసి వచ్చిన వ్యక్తి బలవతంగా లైంగిక దాడి చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో ఇంటికి వచ్చిన తరువాత ఇంట్లో వారితో విషయం చెప్పగా, అది విన్న పక్కింటి మహిళ ఆమెతో గొడవ పడింది. కాగా ఈఘటన జరిగిన తరువాత మహిళ, ఆమె భర్త సదరు మహిళను దుర్భాషలాడుతూ, ఆమెపై దాడి చేశారని సదరు మహిళ ఖనాపురం హవేలీ పోలీసులకు ఈనెల 14న ఫిర్యాదు చేసింది. ఈఫిర్యాదులో ఎక్కడా కూడా లైంగిక దాడి జరిగినట్లు పేర్కొనలేదు. దీంతో గొడవ పై కేసు నమోదు చేసిన పోలీసులు ఇరువురికి పిట్టి కేసు నోటిసులు ఇచ్చారు. మళ్లీ మంగళవారం లైంగిక దాడి జరిగిందని ఫిర్యాదు చేయడంతో పోలీసులు మరోసారి అత్యాచారంపై కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధిరలో ఈజీఎస్ కార్యాలయానికి గది కేటాయింపు



నూతన కార్యాలయంలోకి మారిన శిథిలమైన ఈజీఎస్ కార్యాలయ సిబ్బంది

మధిర, ఆగస్టు 20: మధిరలోని శిథిలమైన ఈజీఎస్ కార్యాలయాన్ని ప్రస్తుతం ఖాళీగా ఉన్న జడ్పీటీసీ చాంబర్‌లోకి మార్చారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన శిథిల కార్యాలయం కథనానికి స్పందించిన జిల్లా అధికారుల ఆదేశాలపై మధిర ఎంపీడీవో ఈమేరకు నూతన గదిని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. దీంతో ప్రస్తుతం అధ్వాన్నస్థితిలో ఉన్న గదిలో అవస్థలు పడుతున్న ఈజీఎస్ కార్యాలయాన్ని జడ్పీటీసీ గదికి మార్చారు. దీనిపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో వెంకటేశ్వర్లు మాట్లాడు తూ ఉద్యోగులు, రికార్డుల భద్రత దృష్ట్యా ప్రస్తుతం ఖాళీగా ఉన్న గదిని తాత్కాలికంగా కేటాయించడం జరిగిందని తెలిపారు. అధికారుల ఆదేశాలమేరకు నూతన కార్యాలయ భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

ముందు రూ.రెండు లక్షలు రుణమాఫీ చేయండి

▸▸ మిగిలిన నగదును తర్వాత కట్టుకుంటాం ▸▸ అధికారుల ముందు రైతులు ఆవేదన



రుణమాఫీ కాని రైతులు ఏవోతో మాట్లాడుతున్న దృశ్యం

కొణిజర్ల, ఆగస్టు20: రుణమాఫీపై రైతులకు గందరగోళంగా మారింది. రూ.రెండు లక్షలు పైగా ఉంటే కట్టాలని బ్యాంకు అధికారులు, వ్యవసాయాధికారులు చెప్పడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందు రూ.రెండు లక్షలు రుణాన్ని మాఫీ చేయండి, ఆ పైన ఉన్న రుణాన్ని తర్వాత కట్టుకుంటాం అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.రెండు లక్షలు పైగా ఉన్నవారే కాకుండా, ఆధార్‌లో తేడాలు, కుటుంబ నిర్ధారణ ఉన్న వారు నుంచి మంగళవారం రైతువేదిక నందు వ్యవసాయాధికారులు స్వీకరించిన దరఖాస్తులలో ఎక్కువగా వచ్చాయి. ముందు మాఫీ అని చెప్పి, ఇప్పుడు రేషన్‌కార్డు, ఒకే కుటుంబం అంటూ నిబంధనలు ఎందుకు పెట్టాలని రైతులు మండిపడుతున్నారు. మండల వ్యవసాయాధికారి బాలాజీ మాట్లాడుతూ మండలం మొత్తం మంగళవారం రోజు 305 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. వాటిల్లో ఎక్కువగా కుటుంబ నిర్ధారణ చేయవలసిన వారే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. ఆధార్‌లో తేడాలు ఉన్న రైతులు ఉన్నారని వారి నుంచి దరఖాస్తులను స్వీకరించామన్నారు. కొంతమంది మహిళలు పసుపుకుంకుమ కింద భూమి ఇస్తే దాని కింద తీసుకున్న రుణానికి భర్తకు సంబంధం ఏమిటని, భర్త ఆధార్‌కార్డుతో లింకు పెట్టడం సరి కాదని ఓ మహిళ ఏవో ముందు ఆవేదన వ్యక్తం చేసింది. రుణానికి ఉద్యోగానికి సంబంధాలు పెట్టవద్దని కొంతమంది రైతులు తెలిపారు. ఇస్తానన్నా రుణం మాఫీ చేయాలని, నిబంధనలు పెట్టవద్దని కోరుతున్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి: ఏఐపీకేఎస్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 20: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మ్యానిఫెస్టో హామీ మేరకు భేషరతుగా రైతు రుణమాఫీ అమలు చేయాలని (ఏఐపీకేఎస్) అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం జాతీయ నాయకులు గుర్రం అచ్చయ్య అన్నారు. బుధవారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మలీదు నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 3,75,000 మంది రైతులను గుర్తించి ఇప్పటి వరకు 1,10,000 రైతు కుటుంబాలకే రుణమాఫీ అమలు చేశారని ఆరోపించారు. ప్రభుత్వం మూడు విడతలుగా అమలు చేసిన రైతు రుణమాఫీ కేవలం 40శాతం మేరకు జరిగిందని ఆరోపించారు. రైతుల సమస్యలపై ఈనెల 28న కలెక్టర్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని రాష్ట్ర కమిటీ పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతు రుణమాఫీపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దమ్మపేట, ఆగస్టు 20: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. మండలంలోని మందలపల్లికి చెందిన రాయల కృష్ణ(45) అనే వ్యక్తి సమీపంలోని ప్రకాశ్‌నగర్ కాలనీకి వెళ్లి వస్తుండగా, వెనుక నుంచి ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు సత్తుపల్లికి తర లించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడికి పాముకాటు: తప్పిన ప్రమాదం

ఆళ్లపల్లి, ఆగస్టు 20: ఆళ్లపల్లి మండల పరిధిలోని బోడాయికుంట గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలుడికి మంగళవారం పాము కాటు వేసింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడాయికుంట గ్రామానికి చెందిన పాయం సుశాంత్ మంగళవారం గ్రామంలో కొందరితో కలిసి గ్రామ శివారులోని వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో నీళ్లలో పాము కాటువేసింది. వెంటనే బాలుడిని స్థానికులు, కుటుంబ సభ్యులు ఆళ్లపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించారు. వైద్యులు ప్రాణపాయం లేదని తెలిపారని కుటుంబ సభ్యులు అన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో కౌలు రైతు ఆత్మహత్య

● శంభూనిగూడెం గ్రామంలో ఘటన



ప్రసాద్(ఫైల్)

జూలూరుపాడు, ఆగస్టు 20: సాగు చేసిన పంటకు పెట్టుబడి పెట్టేందుకు అప్పు పుట్టకపోవడంతో మనస్తాపానికి గురై కౌలు రైతు క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈసంఘటన మండలంలోని శంభూనిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం ఏరుగట్ల గ్రామానికి చెందిన వగ్గెల ప్రసాద్ (36) గత 16 ఏళ్ల క్రితం జూలూరుపాడు మండలం శంభూనిగూడెం గ్రామానికి చెందిన ఉషారాణిని వివాహం చేసుకున్నాడు. గత ఏళ్లుగా భార్య ఇద్దరు పిల్లలతో కలిసి ప్రసాద్ శంభూనిగూడెంలోనే ఉంటూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ ఏడాది ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంటను సాగు చేశాడు. పంటకు పెట్టుబడి పెట్టేందుకు డబ్బులు దొరకడం లేదు. ఈ క్రమంలో ఎంతో మందిని పెట్టుబడి కోసం అప్పు అడిగాడు. అప్పు పుట్టలేదు. దీంతో తాను వ్యవసాయం చేయలేనని, ఎక్కడ అప్పు పుట్టడం లేదని చచ్చిపోవాలనిపిస్తుందని భార్య ఉషారాణి ఎదుట ఆవేదన చెందాడు. గత పది రోజులుగా ప్రసాద్ మద్యాన్ని తాగుతున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి తను కౌలుకు తీసుకునన పొలంలో క్రిమిసంహారక మందు సేవించి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి వెంటనే అతడిని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అర్థరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కౌలు రైతు మృతితో శంభూనిగూడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య ఉషారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య తెలిపారు.

సత్తుపల్లిలో చోరీలు

▸▸ 158గ్రాముల బంగారం, 120గ్రాముల వెండి, రూ.72వేల నగదు అపహరణ

▸▸ వివరాలు సేకరించిన ఖమ్మం క్లూస్ టీమ్



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఏసీపీ రఘు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు20: సత్తుపల్లి పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో మూడు ఇళ్లలో చోరీ జరిగింది. కాలనీలోని ఐసీడీఎస్ కార్యాలయానికి వెళ్లే దారిలో అబుల్ ఫతహ్ గియాజ్ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి దొంగతనం చేశారు. బీరువాలో ఉన్న సుమారు 158గ్రాముల బంగారం, 90తులాల వెండితో పాటు రూ.25వేల నగదు అపహరించుకువెళ్లారు. బంగారం విలువ సుమారు రూ.11,37,544కాగా వీరు సిద్దారం రోడ్డులో నూతన గృహంలో ఉంటుండగా, రాత్రి దొంగతనం జరిగినట్లు బాధితులు చెబుతున్నారు. అదేవిధంగా ఆంజనేయ స్వామి ఆలయం వెనుక తోట వెంకటేశ్వరరావు అపార్ట్‌మెంట్‌లో సిద్దారం గ్రామ లైన్‌మన్ బాణోత్ నాగేశ్వరరావు, పౌండ్రీ వాసులు నివాసం ఉంటున్నారు. నాగేశ్వరరావు ఇంట్లో 26గ్రాముల వెండి, రూ.40వేల నగదు, వాసు ఇంట్లో రూ.7వేల నగదు, ఒక వెండి మొలత్రాడు అపహరించుకు వెళ్లారు. నాగేశ్వరరావు కుటుంబంతో కలిసి రాఖీ పండుగకు సొంతూరు వెళ్లగా, వాసు తన కుమార్తె డెలీవరి కావడంతో ఆంధ్రాకు వెళ్లారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని కల్లూరు ఏసీపీ అనిశెట్టి రఘు, వేంసూరు ఎస్ఐ వీరప్రసాద్ పరిశీలిం చారు. ఖమ్మం నుంచి వచ్చిన క్లూస్ టీమ్ సీఐ నరేష్ వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చోరీపై కేసు నమోదు

ఖమ్మంక్రైం, ఆగస్టు20: నగర పరిధిలోని కైకొండాయిగూడెం రోడ్డులోని అంకమ్మతల్లి ఆలయంలో ఈనెల 17న రాత్రి గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు చొరబడి చోరీ చేసిన విషయం విధితమే. ఈఘటనలో అమ్మవారి రెండు వెండి కిరిటాలు, 9.5గ్రాముల బంగారు వస్తువులు చోరీకి గురయ్యాయని ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఖనాపురం హవేలీ పోలీసులు తెలిపారు.

గొర్రెల కాపరిపై దాడి

రఘునాథపాలెం, ఆగస్టు 20: గ్రామంలోని చివారులో గొర్రెలను మేపుకుంటున్న గొర్రెల యజమానిపై యువకుడు దాడి చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకొంది. రేగులచెలక గ్రామానికి చెందిన దనియాకుల సంగయ్య గొర్రెలు, మేకల్ని పోషణ చేస్తూ కుటుంబ జీవనాన్ని సాగిస్తున్నాడు. మంగళవారం గామానికి సమీపంలోని బీడు భూములో గొర్రెలను మేపుతుండగా, ఇదే గ్రామానికి చెందిన కొనకోప్పుల నవీన్ ఒక్కసారిగా గోర్రెల మీదకు వచ్చి వాటిని దొంగలించే ప్రయత్నం చేశాడు. దీంతో అడ్డగించిన సంగయ్యపై తీవ్రంగా దాడి చేశాడు. బాధిత కుటుంబ సభ్యులు నిందితుడిపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు నవీన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

బేతుపల్లి సొసైటీ సభ్యులకు మాత్రమే భూమిపై హక్కులు

▸▸ సొసైటీ మాజీ అధ్యక్షుడు సోయం అర్జున



మాట్లాడుతున్న సొసైటీ సభ్యులు

సత్తుపల్లి, ఆగస్టు 20: సత్తుపల్లి మండలం బేతుపల్లి గంగారానికి చెందిన ట్రైబల్ జాయింట్ ఫార్మింగ్ సొసైటీలో సభ్యులుగా ఉన్న వారికి మాత్రమే భూములపై హక్కులు ఉంటాయని సొసైటీ మాజీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి సోయం అర్జున, వూకే సింగరాజు, కే.రామచంద్రరావులు చెప్పారు. మంగళవారం వారు సొసైటీ సభ్యులతో కలసి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల కాలంలో సొసైటీకి సంబంధం లేని వారు కొందరు, తమ భూములపైకి వచ్చి తమకు హక్కులున్నాయంటూ హడావిడి చేస్తున్నారని ఆరోపించారు. 1972లో బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని 40/1 సర్వే నెంబర్‌లో 125 ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వం గిరిజనులకు కేటాయించిందని తెలిపారు. ట్రైబల్ జాయింట్ ఫార్మింగ్ సొసైటీని 50 మంది సభ్యులతో ఏర్పాటు చేసి భూమి సొసైటీకి అప్పగించిందన్నారు. అప్పట్లో సదరు భూమి అడవిగా ఉండటంతో, దానిని బాగు చేసుకునేందుకు సొసైటీ సభ్యులు ముందుకు రాగాపోగా, 32 మంది వెళ్లిపోయి వేరే ప్రాంతాల్లో స్థిరపడ్డారని అన్నారు. దశాబ్దాల కాలం వారు సాగు చేయలేదని చెప్పారు. సొసైటీలో మిగిలిన 18 మంది సభ్యులు సొసైటీ నిబంధనల ప్రకారం ఎన్నికలు జరుపుకొని భూమిని అభివృద్ధి చేయటానికి శ్రమించాల్సి వచ్చిందని చెప్పారు.

మిగిలిన 18 మంది సొసైటీ సభ్యులతో పాటు వారి వారసులు, కొత్తగా వచ్చిన మరో నలుగురిని చేర్చి 50 మంది సభ్యులుగా సొసైటీ ఏళ్ల తరబడి నడుస్తోందని వివరించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రతి ఐదేళ్లకు ఒక సారి క్రమం తప్పకుండా అధికారుల సమక్షంలో ఎన్నికలు జరుగుతున్నాయని, ఆడిట్ కూడా జరుగుతోందని చెప్పారు. సొసైటీ గత కమిటీ పదవీ కాలం 2022 ఫిబ్రవరితో ముగిసినప్పటికీ కొత్త కమిటీ ఎన్నికను అధికారులు నిర్వహించలేదని అన్నారు. ఈ క్రమంలో కొందరు బయటి వ్యక్తులు వచ్చి సొసైటీ భూమిలో తమకు హక్కులున్నాయంటూ హడావిడి చేస్తూ తమను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. పాస్‌పుస్తకాలు కూడా జారీ కాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

రైలులో పోగొట్టుకున్న ల్యాప్‌టాప్ అందజేత

మధిరటౌన్, ఆగస్టు20: రైలులో పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను రైల్వే పోలీసులు వెతికిపట్టుకొని బాధితుడికి అప్పగించిన సంఘటన మంగళవారం మధిరలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన మట్లా శ్రీదేవి ఈనెల ఈనెల 19న మధిరలోని తమ బంధువుల ఇంటికి వచ్చేందుకు విజయవాడలో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఎక్కింది. మధిరలో దిగే క్రమంలో రైలులో తన ల్యాప్‌టాప్‌ను బ్యాగ్‌తో సహా మరిచిపోయి దిగిపోయింది. ఇంటికి వచ్చాక ల్యాప్‌టాప్ మరిచిపోయిన విషయం తెలుసుకొని వెంటనే మధిర రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది, రైల్వే ఎస్ఐ వెణుగోపాల్‌రెడ్డి విషయాన్ని సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు తెలపగా రైలు భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌గా మారి కాగజ్‌నగర్ వెళ్లిందని తెలిపారు. వెంటనే రైల్వే ఎస్ఐ ఖాజీపేట పోలీసులకు తెలపగా వారు ఫిర్యాదు దారు ఇచ్చిన బోగీలో వెతకగా వారు బ్యాగ్‌ను అందులోని ల్యాప్‌టాప్‌ను గుర్తించారు. దానిని ఖాజీపేట రైల్వే పోలీసులు మధిరకు చేరవేయగా, మధిర రైల్వే పోలీసులు ఫిర్యాది కుటుంబ సభ్యులకు దానిని అందచేశారు. ల్యాప్‌టాప్‌ను అందించిన పోలీసులకు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపింది.

చెల్లని చెక్కు కేసులో వ్యక్తికి ఆరు నెలలు జైలు

ఖమ్మం లీగల్, ఆగస్టు 20: ఖమ్మం రూరల్ మండలం సప్తగిరినగర్‌కు చెందిన చెల్లనిచెక్కు కేసులో నిందితుడైన తెనాలి ఆంజనేయ ప్రసాద్‌కు ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జికోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప ఆరు నెలలు జైలుశిక్షతో పాటు నిందితుడు ఫిర్యాదుదారుడుకి 20లక్షల రూపాయలు నష్టపరిహారం కింద చెల్లించాలని మంగళవారం తీర్పుచెప్పారు. కేసు వివరాల ప్రకారం.. ఖమ్మం నగరం ముస్తఫానగర్ ప్రాంతానికి చెందిన ఫిర్యాది పసుపులేటి శ్రీనివాసరావు వద్ద నిందితుడు తన కుటుంబ అవసరాల నిమిత్తం 2016 ఏప్రిల్ 10న రూ.పది లక్షలను అప్పుగా తీసుకొని, అదే రోజు నోటు రాయించి ఇచ్చినాడు. తరువాత ఫిర్యాది తన రుణం తిరిగిచెల్లించమని అడగగా 2018 జనవరి 22న ఫిర్యాదికి నిందితుడు రూ.13 లక్షల చెక్కు జారీచేసినాడు. అట్టి చెక్కును ఫిర్యాది తన బ్యాంకులో జమ చేయగా నిందితుడి ఖాతాలో సరిపడ నగదు లేకపోవడంతో చెక్కు నిరాధారణకు గురైంది. ఫిర్యాది తన న్యాయవాది అయిన బిళ్ల క్రాంతికుమారి ద్వారా లీగల్ నోటీస్ జారీచేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేయగా, కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావడంతో ఆరు నెలల శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

TOURS & TRAVELS
★ మహాదేవ టూర్స్: చార్‌ధామ్ 20/9 రూ.30 వేలు, నేపాల్ ముక్తినాథ్ 14/10 రూ.33 వేలు, కార్తీకం కాశి 6/11 రూ.17500/-, రామేశ్వరం 25/11 రూ.18500/-. సంప్ర: 9908844377
AJH-4264

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, బట్టి వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

స్వదేశాగమనము/ విదేశీయానం. | పుట్టిన రోజు | వివాహ వార్షికోత్సవం
షష్టిపూర్తి | లీగల్ నోటీసులు | శ్రద్ధాంజలి
పదవీవిరమణ | వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు
4 Lines Classifieds Khammam + B-Kothagudem Dists 220/- Only Extra Line 48/- only
ఖమ్మం : 9985401672
ఖమ్మం 9985406151 9985401698
కొత్తగూడెం: 9985400885
భద్రాచలం: 9985411347

రేపు పొదెం వీరయ్యకు ఆత్మీయ పౌర సన్మానం

● హాజరుకానున్న డిప్యూటీ సీఎం, మంత్రులు



భద్రాచలం, ఆగస్టు 20: రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు భద్రాచలంలో గురువారం ఆత్మీయ పౌర సన్మానం నిర్వహించనున్నారు. భద్రాచలం పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంకు డిప్యూటీ సీఎం మల్లుభట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఇతర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నట్లు ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో భద్రాచలంలోని గోదావరి వారధి నుంచి కార్యక్రమం జరిగే కేకే ఫంక్షన్‌హాలు వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ క్రమంలో ఇందుకు సంబంధించి ఇప్పటికే అందరికి ఆహ్వానించగా ఏర్పాట్లపై దృష్టి పెట్టినట్లు వారు తెలిపారు.

రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలి

- రైతులు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్‌లను సద్వినియోగం చేసుకోవాలి
- వ్యవసాయ సహాయ సంచాలకుడు రమేష్



రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న వ్యవసాయ అధికారులు

సుజాతనగర్, ఆగస్టు 20: రైతులు మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రీవెన్స్ సెల్‌లను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్ అన్నారు. మంగళవారం సుజాతనగర్ రైతు వేదిక వద్ద రుణమాఫీ కోసం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రైతు రుణమాఫీ 2024కు సంబంధించి మూడు విడతల్లో రైతులకు చెందిన రుణమాఫీ ఖాతాలో నిధులు జమయ్యాయని తెలిపారు. కాని సాంకేతిక కారణాలు బ్యాంకు ఖాతాలు సరిగాలేనివి, కుటుంబ నిర్ధారణ జరగని ఖాతాలు, ఆధార్ నెంబర్లలో తప్పులున్నవి, పాస్‌బుక్ నెంబర్లు లేనివి, బ్యాంక్ ఖాతాల్లో ఉన్న పేర్లతో ఆధార్‌లో ఉన్న పేర్లతో సరిపోని వంటి కారణాల వల్ల మరికొంత మంది రైతులకు చెందిన రుణ ఖాతాల్లో నిధులు జమకాలేదని అన్నారు. ఇలాంటి రైతులకు సంబంధించిన విజ్ఞప్తులను, ఫిర్యాదులను స్వీకరించడానికి మండల వ్యవసాయాధికారి ఆధ్యక్షతన మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ప్రత్యేక కౌంటర్లు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో జి.నర్మద, ఏఈఓలు శరద్ చంద్ర, ప్రనూషా, నరిసింహా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.2 లక్షల లోపు రైతులందరికి రుణ మాఫీ జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి దీపక్ ఆనంద్ తెలిపారు. మంగళవారం మండలంలోని కాకర్ల గ్రామంలోని రైతు వేదిక వద్ద ప్రజా వాణి కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతుల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఏఈవోలు రైతు వేదికల వద్ద అందుబాటులో ఉంటారని, ఈ నెల 30వ తేదీ లోగా దరఖాస్తులను అందించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఏఈవోలు లావణ్య గోపికృష్ణ, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: రుణమాఫీలో అర్హులైన రైతులకు రుణమాఫీ జాబితాలో పేరు లేకుంటే రైతులు తిరిగి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు సూచించారు. మండలంలోని మల్లారం రైతు వేదక వద్ద మంగళవారం రుణమాఫీ గ్రీవెన్స్ సెల్‌ను ప్రారంభించారు. అనంతరం దమ్మపేటలోని రైతు వేదిక వద్ద గ్రీవెన్స్‌ను పరిశీలించారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్, రుణఖాతా పుస్తకం ఇలా అన్ని రకాల పత్రాలను తీసుకుని గ్రీవెన్స్‌లో సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖరెడ్డి, ఏఈవోలు, ఇతర సిబ్బంది ఉన్నారు.

రైతులందరి రుణాలు మాఫీ చేయాలి

- ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ



టేకులపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి, ఆగస్టు 20: రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ డిమాండ్ చేశారు. మండలంలోని ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు రైతువేదికలో మంగళవారం రుణమాఫీ సమస్యల పరిష్కారానికి రైతుల నుంచి వ్యవసాయశాఖ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తుండగా మాజీ ఎమ్మెల్యే హరిప్రియ అక్కడికి చేరుకొని రుణమాఫీ కాని రైతులతో కలిసి అధికారులను ఆమె నిలదీశారు. హరిప్రియ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసంచేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండు చేశారు. గత పదేళ్లలో కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదని దీంతో వివాహాలు అయి వేరు కుటుంబాలుగా ఉంటున్న వారికి రుణమాఫీ వర్తించకుండా పోతుందన్నారు. రూ.2లక్షలకు పైగా బ్యాంకు రుణాలు ఉన్న రైతులు ఆ మొత్తం చెల్లించిన తర్వాతే మాఫీకి అర్హులనే నిబంధన సరికాదన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు లక్కినేని సురేందర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బోడ బాలు, బానోతు కిషన్, శివకృష్ణ, శివ, భుక్యా లాలు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం భారీగా తరలివచ్చిన రైతులు

ఇల్లెందు టౌన్: రూ.2లక్షల రుణమాఫీ పథకం తమకు వర్తించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ వ్యవసాయ శాఖాధికారులకు రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి దరఖాస్తులు అందజేశారు. మంగళవారం ఇల్లెందు పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో రుణమాఫీ కోసం దరఖాస్తులను అందచేశారు. ఇల్లెందు మండల పరిధిలోని వివిధ బ్యాంకుల్లో రుణాలు పొందిన రైతులు రూ.2లక్షలకు లోపు ఉన్నప్పటికీ రుణమాఫీ చెల్లించడం లేదని దరఖాస్తులు చేస్తున్నారు. రేషన్‌కార్డులో ఉన్న ప్రతి ఒక్కరికి రుణాలు ఉంటే అందరికి మాఫీ వర్తించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అధికారులను రైతులు కోరుతున్నారు. అయితే ప్రభుత్వం రూపొందించిన విధానాల పరిధిలోనే రుణమాఫీ ఉంటుందని వ్యవసాయశాఖాధికారులు రైతులకు తెలుపుతున్నారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఇల్లెందు టౌన్, ఆగస్టు 20: సింగరేణి కాంట్రాక్టు కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని సింగరేణి కాంట్రాక్టు కార్మికసంఘం (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి బి.మధు విమర్శించారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో కాంట్రాక్టు వర్కర్స్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల మూలంగానే లాభాలు వస్తున్నాయని వివరించారు. ప్రజాప్రభుత్వంగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు పూర్తి అయిన సింగరేణి కాంట్రాక్టుకార్మికుల సమస్యల పట్ల స్పందించడం లేదన్నారు. కనీస వేతనాలు అమలుచేసేవిధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు అబ్దుల్ నబీ, తాళ్లూరి కృష్ణ, ప్రేమ్‌సింగ్, శంకర్‌రాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కార్మికులు పెన్షన్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● సింగరేణి జీఎం రామచందర్



మణుగూరు, ఆగస్టు 20: కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కొత్తగూడెం శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23న ఉదయం 11 గంటలకు మణుగూరు ఏరియాలోని కమ్యూనిటీ హాల్‌లో మాజీ కార్మికుల కోసం పెన్షన్ అదాలత్ కార్యాక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని దీనిని మాజీ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వచ్చే వారు సంబంధిత ధృవీకరణ పత్రాలను తమ వెంట తీసుకొచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



కుట్టు మిషన్‌ల శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు

చుంచుపల్లి, ఆగస్టు 20: మహిళలు ఆర్థికంగా ఎదగాలని పీఎం విశ్వకర్మ యోజన జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు ఆకుల నాగేశ్వరరావు గౌడ్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం ప్రగతి మైదానంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (ఎన్ఏసీ) నందు 40 మంది మహిళలు కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ధృవపత్రాలను అందజేశారు. మాట్లాడుతూ దేశంలోనే మహిళల అభ్యున్నతి కోసం అహర్నిషలు కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేస్తుందని అన్నారు. అందులో భాగంగానే ఈ పథకం నుంచి స్వయం శక్తితో ఆర్థిక స్వాలంబన పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరాజు, సంస్థ సభ్యులు హెప్సిబా, శిక్షకురాలు బేబి తదితరులు పాల్గొన్నారు.

ఛలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

జూలూరుపాడు, ఆగస్టు 20: ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు ఏదులాపురం గోపాలరావు, బాణోత్ ధర్మాలు కోరారు. మంగళవారం జూలూరుపాడులో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరా పార్క్ వరకు ప్రదర్శన నిర్వహించి ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాయల సిద్దు, లింగాల వీరభద్రం, శరత్, ధర్మా, రాములు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

24న ఆర్‌వోఆర్ చట్టంపై అవగాహన

కొత్తగూడెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఈ చట్టంపై అవగాహన కలిగిన ఎవరైన రాష్ట్రంలో ధరణి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నూతన ఆర్‌వోఆర్ చట్టం 2024పై సూచనలు, సలహాలు ఈ నెల 24వతేదీన సాయంత్రం 3గంటలకు ఐడీఓసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యాలయంలో చర్చిస్తారని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మంగళవారం తెలిపారు. నూతన ఆర్‌వోఆర్ చట్టం 2024పై మీ సలహాలు, సూచనలు చర్చించుటకు ఆహ్వానించనైనది. ఈ సమావేశంలో నూతన ఆర్‌వోఆర్ చట్టంలో అంశాలు తప్ప ఇతర అంశాలను చర్చించకూడదు. ఏమైన ఇతర సమస్యలు ఉన్నట్లైతే ప్రజావాణిలో దరఖాస్తును సమర్పించగలరని తెలిపారు.

ఎమ్మెల్యే చెప్పినా పట్టించుకోరా?



కరకట్టను పరిశీలిస్తున్న నాయకులు

దుమ్ముగూడెం ఆగస్టు 20: దుమ్ముగూడెం వద్ద ప్రమాదకర పరిస్థితిలో ఉన్న గోదావరి కరకట్టకు మరమ్మతులు చేపట్టాలని స్వయంగా ఎమ్మెల్యే డాక్టర్ వెంకట్రావ్ ఆదేశించినా ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఆరోపించారు. బలహీన పడిన కరకట్ట ప్రాంతాల్ని క్షేత్రస్థాయిలో వారు సందర్శించారు. గతంలో ఎమ్మెల్యే వెంకట్రావు దృష్టికి సమస్యను తీసుకెళ్తే వెంటనే పరిష్కరించాలని ఆదేశించినప్పటికీ, ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పనులను ప్రారంభించని పక్షంలో గ్రామ ప్రజలు మంత్రిగారికి ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నారని తెలిపారు. మండల మాజీ అధ్యక్షుడు అబ్బులు, కనుబుద్ది దేవా, అప్పలరెడ్డి, బాలాజీ, శేఖర్, రాంప్రసాద్, జితేంద్ర ఉన్నారు.

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల అప్పీళ్లను పరిష్కరించాలి

భద్రాచలం, ఆగస్టు 20: గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల బదిలీల అప్పీళ్లను పరిశీలించి పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సంబంధిత అధికారులను కోరింది. తెలుగు, హిందీబాషా పండితులను వారి అంగీకారం లేకుండానే బాలికల పాఠశాలలకు కేటాయించారని, వారి నుంచి ఆన్‌లైన్ ద్వారా కాని, మాన్యువల్‌గా కాని ఆప్షన్లు తీసుకున్న తర్వాతే పాఠశాలలు కేటాయించాలని అన్నారు. తక్షణమే ఉపాధ్యాయుల అప్పీళ్లను పరిష్కరించాలని టీపీటీఎఫ్ అధ్యక్షులు బి.రాజు, బి.బాలు, దర్శిని కోరారు.

ఓటరు జాబితా సవరణలపై అవగాహన

దుమ్ముగూడెం ఆగస్టు 20: మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఓటరు జాబితాలో సవరణలపై తహసీల్దార్ అశోక్‌కుమార్ బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. ఈనెల 20 నుంచి అక్టోబరు 18 వరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో బూత్ లెవల్ అధికారులు ఇంటింటా సర్వే నిర్వహించి కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, తప్పుల సవరణలు చేపట్టాలని కోరారు. గిర్దావరు కల్లూరి వెంకటేశ్వరావు, ఎస్ఏ కెనర్సింహారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంటింటికి ఓటర్ నమోదు సర్వే

కరకగూడెం, ఆగస్టు 20: మండలంలో తహసీల్దార్ నాగ ప్రసాద్ ఆధ్వర్యంలో ఇంటింటికి ఓటర్ సర్వేను మంగళవారం నిర్వహించారు. మండలంలో 16 పంచాయతీలు ఉండగా 14 పంచాయతీలలో మంగళవారం సర్వేను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 14 పంచాయతీలలో మొత్తం 12668 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఓటు లేని అరుహులు తప్పక ఓటర్ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు కృష్ణ ప్రసాద్, హుస్సేన్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బాలవెలుగు పాఠశాలకు బియ్యం వితరణ

మణుగూరు , ఆగస్టు 20: మణుగూరు ఏరియాలోని పికే ఓసీలో పనిచేసే సింగరేణి ఉద్యోగి తోట శేఖర్ భార్య సంపూర్ణ జన్మదిన వేడుకల్లో భాగంగా మంగళవారం సంతోష్ నగర్‌లోని శ్రీ విద్యాభ్యాస పాఠశాల విద్యార్థులకు క్వింటా బియ్యాన్ని వితరణగా అందజేశారు. కార్యక్రమంలో శేఖర్ దంపతులు, ధృవ్ నిఖిత్, కియన్ష్, నాయకులు గట్టయ్య సేవా సమితి సభ్యులు నాసర్ పాషా, రామాచారి, వరుణ్ తేజ్, అంగోత్ మంగీలాల్, పాఠశాల నిర్వాహకులు జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

జూలూరుపాడు, ఆగస్టు 20: జూలూరుపాడులోని పోలీస్‌స్టేషన్ సమీపంలో మంగళవారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళ్తే ఖమ్మం జిల్లా ఏన్కూరు గ్రామానికి చెందిన బుచ్చెల లక్ష్మయ్య అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై కొత్తగూడెం నుంచి జూలూరుపాడు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో లక్ష్మయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఆయనను 108లో జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ రాణా ప్రతాప్ సందర్శించి ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే పాయం



సీసీ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

బూర్గంపాడు, ఆగస్టు 20: పేదల సంక్షేమమే..ప్రభుత్వ లక్ష్యమని..కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేస్తుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సారపాకలో విస్తృతంగా ఎమ్మెల్యే పర్యటించారు. పలు కాలనీలలో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ అమలు చేసిందన్నారు. సాంకేతిక కారణల వలన కొందరు రైతుల రుణమాఫీకి అంతరం ఏర్పడిందని త్వరలోనే వ్యవసాయశాఖ అధికారులు అట్టి సమస్యలను పరిష్కారించనున్నట్లు వారు తెలిపారు. అనంతరం ప్రజలు పలు సమస్యలపై అందజేసిన దరఖాస్తులను స్వీకరించి సాధ్యమైనంత త్వరలో పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఉప్పుసాకలోని తెలంగాణ ట్రైబల్ వేల్ఫేర్ ఆశ్రమ బాలుర పాఠశాలను ఎమ్మెల్యే పాయం ఆకస్మికంగా సందర్శించారు. వసతిగృహంలో మెను సరిగా పాటించకపోడంతో పాటు హాజరు పట్టిక సరిగా లేకపోవడంతో వార్డెన్ రాములపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలని, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో వివేక్‌రామ్, ఎంపీవో సునీల్‌కుమార్, ఈవో మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మహ్మద్‌ఖాన్, నాగమణి, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, హరీష్, సుధాకర్‌రెడ్డి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

మణుగూరు: మణుగూరు మునిసిపాలిటి పరిధిలోని భగత్ సింగ్‌నగర్‌లో తాగునీటి సరఫరా కోసం నూతనంగా నిర్మించనున్న వాటర్ ట్యాంకు నిర్మాణాలకు మంగళవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.2.28 కోట్లతో ఈ ట్యాంకు నిర్మించనున్నారు. అనంతరం స్థానిక ప్రజల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఈ రంజిత్, డీఈ వి శ్రీనివాసరావు, ఏఈ కె సత్య మణుగూరు మునిసిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

కరకగూడెం: మండలంలో బుధవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పర్యటనలో మండల స్థాయి అధికారులు ఉదయం 9 గంటలకు తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు.

హత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి

- సీపీఐ, పీవోడబ్ల్యూ, పీడీఎస్‌యూ ఆందోళన



మణుగూరులో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

మణుగూరు, ఆగస్టు 20: కలకత్తాలో ట్రెయినీ డాక్టర్‌పై హత్యాచార ఘటనను ఖండిస్తూ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ అధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు మంగళవారం ఆందోళనలు చేపట్టారు. పార్టీ కార్యాలయం ఎదుట ఉన్న మణుగూరు పట్టణ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు మున్నాలక్ష్మీకుమారి, మండల పట్టణ నాయకులు జంగం మోహన్ రావు, దుర్శాల సుధాకర్‌లు మాట్లాడారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి నాయకులు సర్వర్, గడ్డం వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సీతారాములు, మంగి వీరయ్య, సమ్మక్క, ప్రమీల, పాయం లక్ష్మీ, సుజాత, బేబిరాణి, వజ్జా వెంకటేశ్వర్లు, ఉమర్ ప్రసాద్, రాములు , దుర్గ రాములు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ప్రదర్శన

కలకత్తాలో శిక్షణ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనకు నిరసన వ్యక్తంచేస్తూ పీవోడబ్ల్యూ, పీడీఎస్‌యూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. టీడీపీ సెంటర్‌లో జరిగిన సమావేశంలో భద్రాచలం డివిజన్ కార్యదర్శి సున్నం భూలక్ష్మి, ధ్యుం ప్రణయ్, మాట్లాడారు. దేశ వ్యాప్తంగా జరిగిన ఘటనపై నిరసన వ్యక్తంచేయాల్సిన అవసరం ఉందన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు రాపర్తి లక్ష్మి, నరసమ్మ,పుష్ప, రజిత, శాంతకుమారి, ఎస్‌డి నాసర్ పాషా, మంగీలాల్, మిడిదొడ్ల నాగేశ్వరరావు, సాధనపల్లి రవి, ఎన్డి నాయకులు నాయిని కొండన్న తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

పినపాక, ఆగస్టు 20: మండలంలోని పాతరెడ్డిపాలెం - వెంకట్రావుపేట సరిహద్దుల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఏడూళ్లబయ్యారం సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ రాజ్‌కుమార్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. దాడుల్లో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, వారి వద్ద రూ.6,100 నగదు, 8 మోటార్ సైకిళ్లు, 7 సెల్‌ఫోన్స్ స్వాధీన పరుచుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కాగా మరో 5 నుంచి 7 గురు వ్యక్తులు పరారైనట్లు తెలిపారు. వారిని కూడా అదుపులోకి తీసుకుంటామన్నారు. పేకాట, జూదం, కోడి పందాలు, బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సాగులో ఉన్న పోడు భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలి

- మంత్రి పొంగులేటికి సీపీఎం ఆధ్వర్యంలో రైతుల వినతి



మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ములకలపల్లి, ఆగస్టు 20: సర్వేజరిగి పోడు భూములకు హక్కుపత్రాలు ఇవ్వని పోడు భూములకు వెంటనే హక్కుపత్రాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు హజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. రాంబాబు మాట్లాడుతూ మండల పరిధిలోని మాధా రం పాలవాగు గ్రామాలకు చెందిన గిరిజనులు అనేక సంవత్సరాలుగా పోడు వ్యవసాయం సాగు చేసుకుంటున్న పోడు సాగుదారులందరికి హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొంతమంది అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల పోడు రైతులు హక్కుపత్రాలు రాకనష్టపోయారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గౌరీ నాగేశ్వరరావు, మాలోత్ రాజా, వూకంటి రవికుమార్, నిమ్మల మధు, సాయి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల మస్టర్ల కోతను రద్దు చేయాలి: ఏఐటీయూసీ

మణుగూరు , ఆగస్టు 20: కాంట్రాక్టు కార్మికులనుంచి గైర్హాజరైన అయిన రోజుల వేతనం వసూలు చేసే విధానాన్ని రద్దు చేయాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యేనియన్ ఏఐటీయూసీ మణుగూరు ఏరియా కార్యదర్శి అదేర్ల సురేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం సివిల్ విభాగ కాంట్రాక్టు కారిక్మకులతో సురేందర్ మాట్లాడారు. అనారోగ్య ఇతరత్రాకారణాల వల్ల విధులకు హాజరు కాలేని కార్మికుల నుంచి వారి వేతనాల్లో రాని రోజుల వేతనాల కొత విధించడం ఏమాత్రం సరికాదన్నారు. కోతలు విధించిన వేతనాలను తిరిగి కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల బారిన పడిన కాంట్రాక్టు కార్మికులను ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్నారు కానీ అక్కడ వారికి వైద్యం అందించే వారే కరువయ్యారన్నారు. కార్మికులకు కూడా సింగరేణి వైద్యం అందించేలా యాజమాన్యం చర్యలను చేపట్టాలన్నారు. జీవో 22 ప్రకారం కార్మికులకు వేతనాలు సంక్షేమాలను అందించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా రాజీవ్ జయంతి



మణుగూరులో ఎమ్మెల్యే పాయం

దేశానికి సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చిన మాజీప్రధాని రాజీవ్‌గాంధీ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఇల్లెందు, భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావ్, పాయం వెంకటేశ్వర్లు సోమవారం మాజీప్రధాని, స్వర్గీయ రాజీవ్‌గాంధీ 80వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్‌చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా వ్యాప్తంగా కూడా జయంతి కార్యక్రమాలు నిర్వహించారు.



ఇల్లెందులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోరం



జూలూరుపాడులో..



పాల్వంచలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల



భద్రాచలంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్



కొత్తగూడెంలో రక్తదానం చేస్తున్న యువకులు



దుమ్ముగూడెంలో..



టేకులపల్లిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు